వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 152 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/-




## తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా
# కాంగ్రెస్, బీఆర్ఎస్

- పజలను తప్పుదోవ పట్టిస్తున్న రెండు పార్టీలు
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం దుర్మార్గం
- ప్రధానికి స్వాగతం పలకని వారు మాకు పాఠాలు చెబుతారా
- మీడియా సమావేశంలో మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ,

తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ తదితరులపై మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉండగా ప్రధాన మంత్రి -మిగతా 3 లో

## ఫార్మా భూమి అని చెప్పి..
# ఫోర్త్ సిటీ కోసం యత్నం



- హైకోర్టును తప్పుదోవ పట్టిస్తున్న సీఎం రేవంత్
- లగచర్ల ఘటనతో రైతుల ఆగ్రహం బయటపడింది
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్

హైదరాబాద్,

తెలంగాణ హైకోర్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో భూముల ధరలు తగ్గాయని చెప్పారు. కాంగ్రెస్ మిగతా నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. లగచర్లలో ఉంది ఫార్మా భూమి అని హైకోర్టు కోర్ట్‌కు సీఎం రేవంత్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బయటకు వచ్చి ఫోర్త్ -మిగతా 3 లో



# జార్ఖండ్‌లో బీజేపీదే అధికారం

## సోరెన్ ఇంటికి వెళ్లడం ఖాయమన్న అమిత్ షా

రాంచీ,

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్ సోరెన్ సర్కారుకు ఓటమి తప్పదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇక్కడ బిజెపి కూటమి గెలవడం ఖాయమని అన్నారు. ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని కోరకుంటున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నవంబర్ 23 రోజే సీఎం హేమంత్ సోరెన్ అండ్ కంపెనీకి వీడ్కోలు అన్నారు. -మిగతా 3 లో



## రూ.5 వేల కోట్లతో
# ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి

- విద్యాశాఖకు బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు
- రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి బాలల దినోత్సవం
- హాస్టళ్లలో ఫుడ్‌పాయిజనింగ్ జరిగితే చర్యలు
- ఎల్బీ స్టేడియంలో బాలల దినోత్సవంలో సీఎం రేవంత్



హైదరాబాద్,

రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు చేశాం. 11,062 టీచర్ పోస్టులు -మిగతా 3 లో



# గ్రూప్-4 ఫలితాలు విడుదల

హైదరాబాద్,

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 ఫలితాలను వెల్లడించింది. 8,084 మందితో కూడిన ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసింది. 2022 డిసెంబర్ 1న ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా 8,180 పోస్టులకు గాను 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. పలు దఫాల్లో ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఈరోజు ఫలితాలు వెల్లడించింది. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది.

# రైతుల ముసుగులో గులాబీ గుండాల అరాచకం



- దాడులతో అరచాకం సృష్టిస్తే కఠినంగా అణచివేస్తాం
- లగచర్లలో దాడిని ఉపేక్షించేది లేదు
- రైతులకు నష్టం చేసే ఉద్దేశ్యం లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరిక

హైదరారాబాద్,

రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శలు చేశారు. కుట్రపూరితంగా అధికారులను రైతులకు దూరం చేసే ప్రయత్నం కొంతమంది చేస్తున్నారని మండిపడ్డారు. గులాబీ గూండాల కుట్రలను -మిగతా 3 లో



# ప్రభుత్వంపై కొడంగల్ నుంచే వ్యతిరేకత

## ఇలా ఎన్ని రోజులు అరెస్టు చేయిస్తాడో మేమూ చూస్తాం
## కాంగ్రెస్‌కు ఓటేసినందుకు భూములు గుంజుకుంటావా..?
## మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

హైదరాబాద్,

ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ఇప్పుడు అనుభవిస్తున్నారని, రైతుల నుంచి బలవంతంగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి భూములు -మిగతా 3 లో



# అధికారం కోల్పోవడంతో రెచ్చగొట్టే యత్నాలు

- ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో బీఆర్ఎస్ నేతలు
- డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క విమర్శలు

హైదరాబాద్,

అధికారం కోల్పోయిన భారాస నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మండిపడ్డారు. లగచర్ల ఘటనతో వారి కుట్రలు బట్టబయలు అయ్యాయని అన్నారు. అధికారం లేకపోవడంతో తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు. ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడం పైనే ఆ పార్టీ దృష్టి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం ఏంటో కేటీఆర్ -మిగతా 3 లో


# ఢిల్లీని కమ్మేసిన పొగ

**-రోడ్లపై వాహనాలు కనపించని స్థితి**
**-ఉదయం 9 గంటలకూ కనిపించని సూర్యుడు**



**న్యూఢిల్లీ,**
దేశ రాజధానిలో పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. వాయి కాలుష్యం వల్ల ఉదయం 9 గంటలకూ కూడా సూర్యుడు కనిపించని పరిస్థితి ఉందంటే అక్కడ పరిస్థితులు ఏలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం.. ఆనంద్ విహార్ ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 473గా నమోదైంది. గురువారం ఉదయం రాజధాని ప్రాంతాన్ని దట్టమైన పొగ మంచు కమ్మేసింది. ఫలితంగా విజిబిలిటీ సున్నాకి పడిపోయింది. రోడ్లపై వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఉదయం 9 గంటల సమయంలోనూ సూర్యుడు కనిపించని పరిస్థితి. విజిబిలిటీ జీరోకు పడిపోవడంతో విమాన, రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషన్ ఎయిర్ పోర్ట్‌కు రాకపోకలు సాగించే సుమారు 300కి పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఫ్లైట్ రాడార్ 24 సంస్థ తెలిపింది. మరికొన్నింటిని దారి మళ్లించినట్లు పేర్కొంది. మొత్తం ఢిల్లీకి రావాల్సిన 115 విమానాలు, రాజధాని నుంచి బయలుదేరాల్సిన 226 విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఫ్లైట్ రాడార్ 24 సంస్థ తెలిపింది. సగటున 17 నుంచి 54 నిమిషాలు ఆలస్యంగా విమానాలు నడుస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు ఈ పొగమంచు రైళ్ల రాకపోలకపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.

## శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం..



**తిరుమల,**
వడ్డికాసులవాడు వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రెండు కంపార్టుమెంట్లలో దర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 66,441 మంది భక్తులు దర్శించుకోగా 20,639 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.12 కోట్లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

## లైఫ్ సైన్సెస్ కేంద్రంగా హైదరాబాద్

**ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరారాబాద్,**
తెలంగాణ రాజధాని హైదరాబాద్ లైఫ్ సైన్స్‌కి హబ్‌గా మారిపోయిందని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. లైఫ్ సైన్సెస్ సెక్టార్‌లో గత 10 నెలల్లో 140 ప్రాజెక్ట్స్ వచ్చాయని.. రూ.36000 కోట్ల ఇన్వెస్ట్మెంట్స్ తీసుకొచ్చామని తెలిపారు. దీనివల్ల 51,000ల మందికి ప్రత్యక్ష ఉపాధి, 1.5 లక్షల మందికి పరోక్షణగా ఉపాధి లభించనుందన్నారు. ప్రభుత్వం మారినా పథకాలను కొనసాగిస్తూ.. మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. జీనోమి వ్యాలీ థర్డ్ ఫేజ్‌లో భాగంగా రాష్ట్రానికి భారీ కంపెనీలు వస్తున్నాయని.. యూరోపియన్‌కి చెందిన క్రికా సంస్థ రూ.2000 కోట్లతో తమ ప్లాంట్‌ని ఏర్పాటుచేయబోతుందని తెలిపారు. దీని ద్వారా 2800 మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. జీనోమి వ్యాలీలో ఏడాదికి 5 కోట్ల డెంగ్యూ వాక్సిన్‌లు ప్రొడ్యూస్ చేయబోతున్నారని వెల్లడించారు. వరల్డ్ లీడింగ్ బొయిటెక్నాలజీ కంపెనీ ఒపణ।ని కూడా తమ సెంటర్‌ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతుందని.. తద్వారా 3000 వేల మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయని తెలిపారు.

# చట్టసభలకు పోటీచేసే వయసు తగ్గించాలి

**-21 ఏళ్లకే పోటీ చేసే విధంగా చట్టసవరణ జరగాలి**
**-విద్యార్థుల మాక్ అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరారాబాద్**
ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థుల వయోపరిమితి తగ్గించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఓటింగ్ వయసును 18 ఏళ్లకు తగ్గించిన క్రమంలో పోటీ చేసే వయసును కూడా తగ్గించే అవకాశాన్ని పరిశీలించాల్సి ఉందని అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఎన్‌సీఈఆర్‌టీలో విద్యార్థులు నిర్వహించిన అండర్-18 మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయాలంటే 25 ఏళ్లు నిండాలనే నిబంధన ఉంది. ఓటు హక్కు పొందేందుకు వయోపరిమితి 21 సంవత్సరాల నుంచి 18ఏళ్లకు తగ్గించారు. కానీ, ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయడానికి 25 ఏళ్ల వయసు ఉండాలనే నిబంధనను మాత్రం సవరించలేదు. ఈ నిబంధనను కూడా సవరించుకుని .. 21 ఏళ్లు నిండిన వారు శాసనసభకు పోటీ చేసే అవకాశం కల్పిస్తూ చట్ట సవరణ చేయాలి. తద్వారా యువత చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం ఉంటుంది. 21 ఏళ్లు నిండిన వారు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా పనిచేస్తున్నప్పుడు... 21 ఏళ్లు నిండిన వారు శాసనసభ్యులుగా కూడా రాణిస్తారని బలంగా నమ్ముతున్నా. మాక్ అసెంబ్లీ తీర్మానాల్లో ఈ అంశాన్ని కూడా చేర్చి రాష్ట్రపతి, ప్రధానమంత్రికి పంపించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందులోభాగంగా మాట్లాడుతూ ఇలాంటి సమావేశాలు సమాజానికి చాలా అవసరం అని అన్నారు. అలాగే శాసన సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, సమాధానాలు... ఇతర అంశాలను విద్యార్థులు గమనించాలని సూచించారు. విపక్షాలు ప్రశ్నించడం, ప్రభుత్వాన్ని నిలదీయడం వారి బాధ్యతని గుర్తు చేశారు.లీడర్ ఆఫ్ ది హౌస్, లీడర్ ఆఫ్ ది అపొజిషన్ ఇద్దరికీ సమాన అవకాశాలు ఉంటాయని, సభను సమర్థవంతంగా నడిపే బాధ్యత స్పీకర్ పై ఉంటుందని అన్నారు. అలాగే విపక్షాలు ఆందోళన చేసినా ప్రభుత్వం సమన్వయంతో సభను నడిపించేలా చూడాలని కానీ దురదృష్టవశాత్తు ఈరోజుల్లో కొందరు సభను ఎలా వాయిదా వేయాలా అనే విధంగా చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. మాక్ అసెంబ్లీని స్ఫూర్తిదాయకంగా నిర్వహించిన మీ అందరినీ అభినందిస్తున్నానని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, అగ్రికల్చర్ రెవల్యూషన్ తీసుకొచ్చారని, వారి వల్లే మనకు సమాజంలో ఇవాళ అవకాశాలు వచ్చాయని ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. దేశంలో నిర్బంధ విద్య అమలు చేసేందుకు సోనియా గాంధీ, మన్మోహన్ ఎంతో సింగ్ కృషి చేశారని 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కును అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీ గారిది అని ప్రశంసించారు. ఇక ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేసేందుకు 25 ఏళ్ల వయసు నిబంధన ఉందని, 21 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తే యువత రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని విద్యార్థులకి తెలిపారు. మాక్ అసెంబ్లీలో ఇలాంటి బిల్స్ ను పాస్ చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# లగచర్ల ఘటనలో సంచలన విషయాలు


**-దాడి కారుకుడు సురేశ్‌కు భూమే లేదు**
**-ప్రభుత్వానికి కలెక్టర్ నివేదించినట్లు సమాచారం**
**-తాము దాడిలో పాల్గొనలేదంటున్న గ్రామస్థులు**
**-హైదరాబాద్ మీడియా ముందు గగ్గోలు**



**హైదరారాబాద్,**
లగచర్ల ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏ1గా ఉన్న బీఆర్ఎస్ నేత సురేష్‌కు అసలు భూమి లేదని వికారాబాద్ కలెక్టర్ తేల్చారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ఇచ్చిన నివేదికలో కీలక అంశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సురేష్, అతని సోదరుడు మహేష్‌కు ఎలాంటి భూమి లేదని నివేదిక పేర్కొన్నట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న 42 మంది నిందితుల్లో 19 మందికి భూమి లేదని కలెక్టర్ గుర్తించి, తెలియచేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ దాడి ఘటనలో ఇప్పటికే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా 16మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇదిలావుంటే తెలంగాణలో వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటన సంచలనం సృష్టిస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర రెవెన్యూ సిబ్బందితో గ్రామస్తులు తిరగబడి దాడి చేయడం తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటన వెనక రాజకీయ కుట్ర ఉందని అనుమానిస్తోన్న ప్రభుత్వం లగచర్ల ఘటనను సీరియస్గా తీసుకుని సమగ్ర దర్యాప్తుకు ఆదేశించింది. లగచర్ల ఘటనలో ఇప్పటికే బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు కూడా ఈ ఘటనలో తెరపైకి వచ్చింది. ఈ పరిమాణాల నేపథ్యంలో లగచర్ల గ్రామంలో రాష్ట్రంలో ఒక్కసారిగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో లగచర్ల గ్రామస్తులు మీడియా ముందుకు వచ్చారు. లగచర్ల గ్రామ ప్రజలు హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 'మా గ్రామానికి ఫార్మా కంపెనీ వస్తుందని ప్రచారం చేశారు. ఫార్మా కంపెనీ పెడితే మా భూములు కోల్పోతాం. మా భూములు లాక్కోవాలని చూస్తున్నారు. మాకు ఫార్మా కంపెనీ వద్దు. ఫార్మా కంపెనీ వలన మాకు రోగాలు వస్తాయని అన్నారు. అసలు కలెక్టర్ మా ఊరికి వస్తున్నాడని మాకు తెలియదు. మేము ఎవరిపై దాడులు చెయ్యలేదు. మాపై, మా కుటుంబాలపై దాడులు చేశారు. పోలీసులు మా కుటుంబ సభ్యులను అరెస్ట్ చేశారు. వాళ్లను వెంటనే విడుదల చెయ్యాలి. మాకు ఏం జరిగిన ఫార్మా కంపెనీ ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదని అన్నారు. లగచర్ల ఘటన రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోన్న వేళ ఏకంగా.. ఆ గ్రామ ప్రజలకు మీడియా ముందుకు రావడం చర్చనీయాంశంగా మారింది.

# రామన్నకుంట ఉందా.. లేదా

**హైదరాబాద్**
హైదరాబాద్‌లోని రామమ్మ కుంట ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు వ్యవహారం హైకోర్టుకు వచ్చింది. ఆక్రమణలను తొలగించామని ప్రభుత్వం, పూర్తిగా తొలగించలేదని పిటిషనర్ తరుపు లాయర్ చెప్పారు. ఇరు పార్టీలు అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. వివరాలను పరిశీలించి తప్పుడు సమాచారం ఇచ్చిన వారి సంగతి తేలుస్తామని రెండు పక్షాల వారిని హెచ్చరించింది. రామన్న కుంట బఫర్ జోన్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) భవనం నిర్మించడాన్ని సవాల్ చేస్తూ మానవ హక్కులు, వినియోగదారుల రక్షణ సెల్ ట్రస్ట్ ఏప్రిల్ 2023లో పిల్ దాఖలు చేసింది. అఫిడవిట్ దాఖలు చేయాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీని హైకోర్టు 2023 జూలైలో ఆదేశించింది. గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.



### ఫోన్‌ట్యాపింగ్ కేసులో..

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు(ఏ-3), మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు పొడిగించింది. వైద్య కారణాల నేపథ్యంలో ఈ నెల 18 వరకు పొడిగిస్తున్నట్టు స్పష్టం చేసింది. బెయిల్ గడువు గురువారంతో ముగియనుండటంతో మరోసారి పొడిగించాలని భుజంగరావు తరుపు లాయరు విజ్ఞప్తి చేశారు. దీనికి నాంపల్లి కోర్టు నిరాకరించింది. గురువారం సాయంత్రం 4 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది. దీన్ని సవాల్ చేస్తూ భుజంగరావు హైకోర్టులో గురువారం లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. భుజంగరావు ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నందున బెయిల్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. మళ్లీ జైలుకు పంపితే ఆరోగ్యం మరింత కీణించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆయనకు ఓ స్టంట్ ఉండగా గుండె జబ్బుతో పాటు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. రోజూ డయాలసిస్ చేయించుకోవాలని వైద్యులు సూచించారని చెప్పారు. మధ్యంతర బెయిల్ పొడిగించడానికి పీపీ పల్లె నాగేశ్వర్‌రావు అభ్యంతరం చెప్పారు. పిటిషన్ ఇప్పుడే వేసినందున సూచనలు పొందడానికి, అంశాలను పరిశీలించి వాదనలు వినిపించడానికి సమయం కావాలని కోరారు. జైలుకు వెళ్లకుండా తప్పించుకోవడానికే పిటిషనర్ లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారని వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అనారోగ్య కారణాల రీత్యా బెయిల్‌ను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4.30 గంటల వరకు పొడిగిస్తున్నట్టు స్పష్టం చేశారు. తదుపరి విచారణను 18కి వాయిదా వేశారు.

### రాధాకిషన్‌రావు పిటిషన్ వాయిదా..

ఇదే కేసులో మరో నిందితుడు(ఏ-5) రిటైర్డు పోలీస్ అధికారి పి.రాధాకిషన్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 18కి వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాధాకిషన్ రావు హైకోర్టును ఆశ్రయించారు. ఇతర నిందితులు ఇచ్చిన తప్పుడు వాంగ్మూలం మేరకు తనను అరెస్టు చేశారనీ, సీనియర్ సిటిజన్‌ను అయిన తను మార్చి నుంచి జైలులో ఉంటున్నానని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు.

# రూ.5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

(మొదటి తరువాయి)

భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించామని సీఎం తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల కలలను నిజం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. 'రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు.. దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత అని,. నవీన భారత రూపశిల్పి నెహ్రూ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం అన్నారు. అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలి. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం. గత సీఎంను ఏనాడైనా మీరు చూశారా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలని సీఎం కోరారు. ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాల్లో ఇటీవల జరుగుతోన్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు తినే ఆహారంలో కల్తీ జరుగుతోంది. విద్యార్థులు తినే భోజనంలో పురుగులు, బల్లులు వస్తున్నాయి. ఇక నుండి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టకపోతే జైలుకు పంపుతాం. విద్యార్థులకు గ్రీన్ ఛానెల్ ద్వారా కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలి. విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి ఆహారం పెట్టాలి. ముఖ్యమంత్రి, మంత్రులు తినే సన్న బియ్యమే గురుకులాల విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. ఎక్కడైనా విద్యార్థులకు దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకోం' అని సీఎం రేవంత్ రెడ్డి స్టాం÷–రగ్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని.. ఈ విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్ అన్నారు. ఇందులోనే కాబోయే ఇంజనీర్లు, డాక్టర్లు, ముఖ్యమంత్రులు ఉన్నారన్నారు. ఈ వేదికగా మీ కళల్ని ప్రదర్శించే అవకాశం నాడు ఇచ్చారా..? కానీ మీ రేవంత్ అన్న మిమ్మల్ని కలుసుకున్నాడు.. మీతో ఉన్నాడని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు వినపడేలా విద్యార్థులు చప్పట్లు కొట్టాలని ఈ సందర్భంగా స్టూడెంట్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పండగ పేరుతో సారా బుడ్లతో దొరికిన వారికి శిక్ష తప్పదని పరోక్షంగా కేటీఆర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఫార్మా భూమి అని చెప్పి ..

# ఫోర్ట్ సిటీ కోసం యత్నం

(మొదటి తరువాయి)

సిటీ అంటున్నారని కేటీఆర్ విమర్శించారు.తెలంగాణ భవన్‌లో గురువారంమీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ భవన్‌కు లగచర్ల భూసేకరణ గిరిజన కుటుంబాలు చేరుకున్నాయి. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉంటానని కేటీఆర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి సీట్ కోసం మంత్రులు ఎదురుచూస్తున్నారని కేటీఆర్ విమర్శలు చేశారు. నల్గొండ ,ఖమ్మం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , మల్లు భట్టి విక్రమార్క సీఎం చైర్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ముందుగా తన సీట్ పోకుండా రేవంత్ రెడ్డి చూసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో భూముల ధరలు పెరిగాయని అన్నారు. ఏమైనా అభివృద్ధి చేస్తారేమోనని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. 'లగుచర్ల ఇష్యూతో సర్కారు బంగపడింది. లగచర్లలో అరెస్టు అయిన వారిని పోలీసులు తీవ్రంగా కొట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలను వదిలి పెట్టి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారు . పోలీసులు ఘోరంగా ప్రవర్తిస్తున్నారు. మా నాయకుడు సురేష్ తప్పేం చేశారు. నరేందర్ రెడ్డినీ ఎందుకు అరెస్టు చేశారు. నాలుగేళ్లలో మేమే అధికారంలోకి వస్తాం. ఆంధ్రలో ఏం జరిగిందో తెలంగాణలో అదే జరుగుతది. బీఆర్ఎస్ నేతలపై బోగస్ కేసులు పెడుతున్నారు. అధికారులకు అంత స్వామి భక్తి పనికి రాదు. రేవంత్ పిచ్చోడు.. అసలు వదలం. బాధితులను ఢిల్లీకి తీసుకెళ్తాం. నేషనల్ హెచ్ఆర్‌సీలో ఫిర్యాదు చేస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు.

### తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా

# కాంగ్రెస్, బీఆర్ఎస్

(మొదటి తరువాయి)

రాష్ట్రానికి వస్తే స్వాగతం పలకలేని మొఖాలు ఇవాళ మేమేం చేయాలో చెప్తయా.. అని కిషన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ సర్టిఫికేట్ మాకు అక్కర్లేదని అన్నారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని విమర్శించారు. అందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం చేస్తోందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని... గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుందని ఈ క్రమంలో కొంత జాప్యం జరిగితే తొందరపాటుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, అంతమాత్రాన బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే చెప్పడం అవివేకమని కిషన్ రెడ్డి అన్నారు. అవినీతి ఎక్కడ జరిగినా విచారణ జరపాలన్నది తమ డిమాండ్ అని అన్నారు. కాళేశ్వరం మీద సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని, సీఎం రేవంత్ రెడ్డి విచారణ కోరారా.. అని ప్రశ్నించారు. గవర్నర్ నిర్ణయం తీసుకోవాలంటే లీగల్ ఒపీనియన్ అనేది ఉంటుందని చెప్పారు. అమృత్ టెండర్లపై జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ తామే కోర్టుకు వెళ్లామని గుర్తు చేశారు. ప్రజలతో తప్ప ఏ పార్టీతో బీజేపీ ములాఖత్ కాలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. వైఫల్యాలను, అసమర్థత నుంచి దృష్టి మళ్లించేందుకు రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని, కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు తమకు అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి ప్రాజెక్టులు ప్రారంభించడానికి వస్తే బయటకు రాని కేసీఆర్, కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. కలెక్టర్ మీద దాడి తప్పు అని.. కానీ గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టడం కూడా సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటన అని, ఆయన తన ప్రజలతో మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని, ఒక్క అవినీతి, కుంభకోణం ఆరోపణ లేకుండా బీజేపీ, శివసేన ప్రభుత్వ పాలన సాగిందని కిషన్ రెడ్డి అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో బొగ్గు శాఖ, గనుల శాఖ విడివిడిగా పెవిలియన్లు ఏర్పాటు చేశామన్నారు. కోల్ ఇండియా ప్రపంచంలోనే 3వ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారని, ఇది ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. బొగ్గు వెలికితీత ముగిసిన తర్వాత ఆ గనులను పర్యావరణానికి, ప్రజలకు ఉపయోగపడేలా ఎలా తీర్చిదిద్దాలి అన్న విషయంపై పనిచేస్తున్నామని చెప్పారు. బొగ్గు పరిశ్రమలో ప్రమాదాలు లేకుండా కార్మికుల క్షేమమే ప్రధాన ఎజెండాగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ వరకు కోల్ ఇండియా ఫౌండేషన్ డే ఉత్సవాలు

# రైతుల ముసుగులో గులాబీ గుండాల అరాచకం

(మొదటి తరువాయి)

రైతాంగం అర్థం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలను కాపాడుకున్నట్లే, అధికారులను కాపాడుకోలేకపోతే పని చేయడానికి ఏ అధికారి ముందుకు వస్తారని ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియా తో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఇదే పద్ధతి పాటించారా అని నిలదీశారు. రైతులను నష్టపెట్టాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని మంత్రి పొంగులేటి అన్నారు. వారి సమస్యలను వినడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని తెలిపారు. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. లగచర్ల సంఘటను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని అన్నారు. ఈ రోజు అధికారులపై దాడి జరిగినట్లుగానే ..రేపు రాజకీయ



నాయకులు, ప్రజలపై దాడి జరిగితే ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. వికారాబాద్ జిల్లాకు ఫస్ట్ మేజిస్ట్రేట్‌గా ఉన్న కలెక్టర్‌పైనే హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. అధికారుల మీద దాడి జరగడం మనమీద మనం దాడి చేసుకునట్లేనని అన్నారు. ఏం తప్పుచేశారని ఆనాడు ఖమ్మంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైల్లో పెట్టారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లో రైతులను దేశద్రోహులుగా చిత్రీకరించారని ఆరోపించారు. పిల్లా, పాపా, ముసలి అనే తేడా లేకుండా రాత్రికి రాత్రి వారిని అరెస్ట్ చేసి సంకెళ్లు వేసిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో దళితులకు బేడీలు వేసిన సంగతి మరిచిపోయారా అని నిలదీశారు. లగచర్లలో ఆ పరిస్థితి లేదు కదా అని మంత్ర పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు.

# జార్ఖండ్‌లో బీజేపీదే అధికారం

(మొదటి తరువాయి)

ఝార్ఖండ్‌లో మలివిడత ఎన్నికల ప్రచారం సందర్భంగా దుమ్రిలో ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా ప్రసంగించారు. అధికార దురాశ వల్లే ఝార్ఖండ్ ఏర్పాటును వ్యతిరేకించిన ఆర్జేడీ –కాంగ్రెస్ ఒడిలో హేమంత్ సోరెన్ కూర్చోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న అమిత్ షా.. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారన్నారు. ఝార్ఖండ్‌లో చొరబాట్లను హేమంత్ సర్కార్ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే చొరబాటుదారులను బహిష్కరిస్తామన్నారు. అనేక పరిశ్రమలు నెలకొల్పి.. ఒక్క యువకుడు కూడా వలస వెళ్లకుండా చూస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హేమంత్ సోరెన్ గతంలో నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని సైతం నెరవేర్చలేదన్నారు. భాజపా అధికారంలోకి వస్తే.. యువతకు నెలకు రూ.2వేలు నిరుద్యోగ భృతి కల్పించడంతో పాటు 2లక్షలకు పైగా ఖాళీ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

# అధికారం కోల్పోవడంతో రెచ్చగొట్టే యత్నాలు

(మొదటి తరువాయి)

చెప్పాలని భట్టి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో భట్టి మాట్లాడారు. 'నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ వైఫల్యమా అని నిలదీసారు. రైతు రుణమాఫీ చేయడం వైఫల్యమా అని నిలదీసారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టడం ప్రభుత్వ వైఫల్యమా? ఫార్మా క్లస్టర్స్ విస్తరణను వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని అన్నారు. కక్షపూరిత రాజకీయాలకు మేం వ్యతిరేకం అన్నారు. ప్రతిపక్షంగా భారాస తన పాత్ర పోషించిందా చెప్పాలని నిలదీశారు. కులగణన చేస్తామని మాట ఇచ్చాం. దాని ప్రకారం చేసి చూపిస్తున్నాం. ఇది విప్లవాత్మక నిర్ణయం.. రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుంది. అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకునే ప్రశ్నలు తయారు చేశాం అని భట్టి విక్రమార్క అన్నారు.

# ప్రభుత్వంపై కొడంగల్ నుంచే వ్యతిరేకత



(మొదటి తరువాయి)

గుంజుకుంటున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని హరీశ్‌రావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ పగ ప్రతీకారంతో పట్నంను కుట్రపూరితంగా నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని ఆరోపించారు. కొడంగల్ నుంచే ప్రజాపాలన మీద తిరుగుబాటు మొదలైందని.. ఈ అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మీకు ఓటేస్తే మేలు జరుగుతుందనుకుంటే పాపానికి.. లగచర్ల గ్రామం భూములను గుంజుకోవడమే నువ్వు చేసే మేలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. ఎక్కడ ఏం జరిగినా బీఆర్ఎస్‌పై పెడుతున్నారన్నారు. నిరుద్యోగులు, రైతులు, పోలీసులు స్వచ్ఛందంగా ధర్నా చేస్తే అది బీఆర్ఎస్ చేయించిందని రేవంత్ అంటున్నారని.. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్ఎస్ చేసిందనే అంటున్నారన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడడం ప్రతిపక్షాలుగా మా బాధ్యత అన్నారు. మమ్మల్ని అక్రమంగా కేసులు పెట్టాలనుకుంటున్నావేమో .. మాపై కోపం ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయండి.. కానీ అమాయక గిరిజన రైతులపై కేసులెలా పెడతారని సీఎంని ప్రశ్నించారు. వెంటనే గిరిజన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా ..? ప్రజాస్వామ్యమెక్కడుంది అంటూ నిలదీశారు. మల్లన్నసాగర్‌లో రేవంత్ రెండురోజులు నిరసన చేస్తే మేం అడ్డుకున్నమా.. ? అని ప్రశ్నించారు. అర్ధరాత్రి మహిళల చాతిమీద కాళ్లు పెట్టి అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఈ ప్రజల తిరుగుబాటు ఆగదని.. రేవంత్‌ని గద్దె దించే దాకా నిద్రపోమన్నారు. మా ప్రభుత్వంలో 14వేల ఎకరాలు ఫార్మాసిటీ కోసం సేకరించామని.. అక్కడెందుకు ఫార్మాసిటీ కట్టరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ముసుగులో దళితుల, గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన ఇప్పుడు కనిపిస్తోందన్నారు. రైతుల భూములు గుంజుకోవడమే ఇందిరమ్మ పాలన అని నిలదీశారు. రేవంత్ పాలన అదానీ, తమ్ముళ్లు, అల్లుళ్ల కోసమేనని.. బీఆర్ఎస్ పార్టీ దళిత, గిరిజనుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. కేటీఆర్‌పై సైతం కుట్రలు చేస్తున్నారని.. ఆ రోజు మల్లన్నసాగర్‌లో నీ మీద కేసులు పెట్టినమా అంటూ సీఎం రేవంత్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్దంగా వ్యవహరించామని.. నరేందర్ రెడ్డికి ఏ సంబంధం లేదన్నారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో తెలియదని.. మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడానికి ఒక్క నిముషం ముందు ఒత్తిడి చేసి నరేందర్‌రెడ్డితో సంతకం చేయించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి బడాబాబులపై ప్రేమ ఉందన్నారు. నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని.. ఆయనకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. ధర్మమే గెలుస్తుందని.. న్యాయస్థానంలో తమకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన నిర్దోషిగా బయటకు వస్తారన్నారు.

## సంపాదకీయం


# జనగణన...ప్రధాన సమస్యలు !

శీతాకాల పార్లమెంట్ సమావేశాలు త్వరలోనే జరుగనున్నాయి. ఈ సమావేశాల్లోనే జమిలి ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జమిలి ఫీవర్ పట్టుకుంది. జమిలి ఎన్నికలు జరిపి తీరుతామన్న పట్టుదలలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం అని విపక్షాలు ఇప్పటికే వాదిస్తున్నాయి. ఎందుకంటే వారిని నిరంతర ఎన్నికల ప్రక్రియ ఉంటేనీ జీవితం గగడవదు. అయితే జమిలి ఎన్నికలతో వచ్చే నష్టం లేదు. తరచూ ఎన్నికల వల్ల దేశ ఖజానాకు బొక్క పడుతోంది. అలాగే రాజకీయ నాయకులు నిత్యం ఎన్నికలతో ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో ప్రజా సమస్యలు ఎన్నికల గాలికి కొట్టుకు పోతున్నాయి. దేశాన్ని గాడిలో పెట్టాలంటే పలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఇవన్నీ మోడీ ప్రభుత్వం చేయగలుగుతుందా..అంతటి చిత్తశుద్ది ఉందా అన్నది చూడాలి. ప్రధానంగా జమిలికి ముందే దేశ జనాభా గణన జరగాలి. దీంతోపాటే ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తీసుకుని రావాలి. ఎవరెన్ని రకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా, రాజకీయ పోరాటం చేసినా..దేశానికంతటికీ ఒకేదేశం, ఒకే చట్టం అమల్లోకి రావాలి. అలాగే ప్రధానంగా పెరుగుతున్న జనాభాను కట్టడి చేయాలి. ఇందులో కులమతాలకు తావులేకుండా చేయాలి. ఇవి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. అలాగే కాంగ్రెస్ పార్టీ కులగణనతో దేశంలో విభజన రాజకీయాలు చేస్తోంది. దీనిపైనా స్పష్టత రావాల్సి ఉంది. కులాలను పక్కన పెట్టేలా కఠిన రాజ్యాంగ చర్యలకు ఉపక్ర మించాలి. కులాల పేరుతో దేశాన్ని చీల్చే ప్రక్రియ సరైనది కాదు. ఆధునిక సమాజంలో ఇంకా కులాలను పట్టుకుని వేళ్లాడడం కూడా అంతమంచిది కాదు. ప్రజల్లో ఆడా,మగా, ఉన్నవారు, లేని వారు అన్న విభజన రేఖలు మాత్రమే ఉండాలి. వాటి ఆధారంగానే అన్ని రకాల ప్రయోజనాలు, కార్యక్రమాలు అమలు కావాలి. మొత్తంగా పదేళ్లుగా ఈ అంశాలపై ఊరిస్తూ వచ్చిన మోడీ ఇప్పటికైనా కఠిన నిర్ణయాలతో ముందుకు సాగితేనే దేశంలో అలజడి లేకుండా ప్రశాంతంగా సాగగలదు. జనాభ నియంత్రణ కేవలం హిందువులకే అన్న పద్దతిలో సాగడం మంచిపద్దతి కాదు. ఇకపోతే జమిలి ఎన్నికలకు ముందే జనాభా గణన చేపట్టాలి. దేశంలో ఆరోవేలుగా ఉన్న గవర్నర్ వ్యవస్థలను రద్దు చేయాలి. పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ఎంపిటిసిలు, జడ్పీటిసీల వ్యవస్థలను ఎత్తేయాలి. పంచాయితీలకే గ్రామాల అభివృద్ది బాధ్యతను చట్టబద్దంగా అప్పగించాలి. కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా..అవి సక్రమంగా వినయోగించడం లేదు. దీంతో గ్రామాలు ఏమాత్రం అభివృద్ది చెందకుండా వట్టి పోతున్నాయి. ఇకపోతే వచ్చే ఏడాది జనగణన పక్రియను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. అందు లో ఒకటి మహిళా రిజర్వేషన్ చట్టం కాగా, రెండోది లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల నియోజకవర్గాల సంఖ్య జనాభా ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దేశంలో భిన్నత్వాన్ని, ప్రజాస్వామి క స్ఫూర్తిని చాటేలా చట్టసభల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా సీట్ల కేటాయింపు ఉంటుంది. దేశ, రాష్ట్ర జనాభాను పరిగణనలోకి తీసుకొని లోక్‌సభ సీట్లసంఖ్యను నిర్ణయిస్తారు. కొత్తగా లెక్కించే జనాభా ఆధారంగా శాసనసభ,లోక్‌సభ సీట్లు పెరుగుతాయని రాజకీయవర్గాలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. సీట్లు పెరిగితే తమకు ప్రాతినిధ్యం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే రాజకీయ పదవులను తగ్గించే పని కూడా చేపడితే మంచిది. రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థతో పాటు శాసనమండలులు కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా ఉన్నాయి. వీటిని శాశ్వతంగా ఎత్తేస్తే మంచిది. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు మాత్రమే పరిమితం కాకుండా లోక్‌సభ, శాసనసభల సీట్ల సంఖ్యను కూడా పెంచాలని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయి. ఎందుకంటే ఎన్ని సీట్లు పెంచితే అన్ని విధాలుగా లబ్ది పొందేది కేవలం రాకజీయ పార్టీలు మాత్రమే. దేశంలో లోక్‌సభ సీట్లను పెంచితే మాత్రం దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. అందుకే దేశ ప్రజల దృష్టి 2025లో జరగనున్న జనాభా లెక్కలపై పడింది. ఇకపోతే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్ని ఆమోదించారు. దీనికి జనాభగణను లింక్ చేశారు.మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో జనగణన కీలకంగా ఉంది. 2023లో ఈ బిల్లు 106వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంగా మారింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం జనగణన పూర్తయిన వెంటనే దాన్ని అమల్లోకి తీసుకుని వస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చట్టంలో కూడా పొందుపరిచింది. అందుకే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రావాలంటే కచ్చితంగా జనగణన జరిగితీరాలి. అప్పుడే మహిళల దశాబ్దాల కల సాకారమవుతుంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. మహిళా రిజర్వేషన్ల ద్వారా దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన మహిళలు చట్టసభల్లోకి ప్రవేశించేం దుకు ఉన్న ఆటంకాలు తొలగిపోతాయి. మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. మళ్లీ 2021లో జనగణన జరగాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా పడింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం 2025 మొదటి త్రైమాసికంలో జనగణన ప్రారంభం కానున్నది. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్ వల్ల ఏడాదిలోగా పక్రియ సమర్ధవంతంగా పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. సకాలంలో జనగణన పూర్తయితే నియోజకవర్గాల పునర్విభజనకు కూడా మార్గం సుగమం అవుతుందన్నది రాజకీయ పార్టీల ఆశగా ఉంది. ఎలాగూ జనగణన తప్పదు కనుక అనేక కీలక అంశాలపైనా శాశ్వత నిర్ణయాలు తీసుకోవాల్సిన అసవరం ఉంది. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకుని అవసరమైన మేరకు రాజ్యాంగ సవరణలను ఆమోదించుకోవాలి. ఒకేదేశం ఒకేచట్టం ఇందులో ప్రధాన మైనది. జనాభా నియంత్రణ కూడా అంతే ప్రధానమైనది. వనరులు తగ్గిపోతున్న క్రమంలో జనాభా నియంత్రణ లేకుండా సాగితే దేశంలో అరాచకం ప్రబలే ఆస్కారం ఉంది. దీనిని గమనించి కేంద్రం చర్యలు తీసుకుంటే మంచిది.

# బుల్డోజర్ బాటలో ట్రంప్!

కాపురం చేసే కళ కాలు తొక్కినపుడే తెలుస్తుందన్న సామెత తెలిసిందే. అదే జరిగింది. డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైతే అతగాడి ఫాసిస్టు అజెండాను అమలు చేస్తాడని భయపడిందంతా గద్దెనెక్కక ముందే వాస్తవ రూపం దాలుస్తోంది. అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ విజయం సంపూర్ణమైంది. ఇప్పటికే అధ్యక్ష స్థానం, సెనెట్‌ను వశం చేసుకున్న ఆ పార్టీ పార్లమెంటు ప్రజాప్రతినిధుల సభ కాంగ్రెస్‌లో కూడా మెజారిటీ సాధించింది. ఇది రాస్తున్న సమయానికి ఇంకా తొమ్మిది సీట్ల ఫలితాలు వెల్లడి కావాల్సి ఉండగా 435కు గాను రిపబ్లికన్లకు సభలో కావాల్సిన మెజారిటీ 218 స్థానాల్లో విజయం లేదా ముందంజలో ఉన్నట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. పోస్టు ద్వారా వచ్చే ఓట్లకు ఎన్నికలు ముగిసిన తరువాత వారం రోజుల గడువు ఉండటంతో మెల్లగా వస్తున్న వాటి లెక్కింపు కొనసాగుతోంది. గురువారం నాటికి మొత్తం పోలైన వాటిలో 97శాతం లెక్కింపు జరిగింది. ఇప్పటికే మెజారిటీలను బట్టి ఆ ఓట్లు ఎటు పడినా ఫలితాలు మారే అవకాశం లేదన్న అంచనాతో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వచ్చేది దాదాపుగా తేలినట్లే. మరో రెండేండ్లకు జరిగే మధ్యంతర ఎన్నికల్లో వచ్చే సీట్లను బట్టి పార్లమెంటులో మెజారిటీలు మారవచ్చు, కొనసాగ వచ్చు. అప్పటి వరకు డోనాల్డ్ ట్రంప్ తన బుల్డోజర్ అజెండాను అమలు జరిపేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే ఉభయ సభల్లో మెజారిటీలు తక్కువగా ఉన్నందున కొన్ని సందర్భాలలో అధ్యక్షుడి నిర్ణయాలకు ఆమోదం కోసం ప్రతిపక్ష డెమోక్రాట్లను ఆశ్రయించాల్సి ఉంటుంది. జో బైడెన్‌కు కాంగ్రెస్‌లో మెజారిటీ లేకున్నా 2022 నుంచి రిపబ్లికన్ల మద్దతుతో ముందుకు సాగిన తీరును చూస్తే ట్రంప్ కూడా అదే బాటలో నడుస్తాడు.

ఇంకా అధికారాన్ని లాంఛన ప్రాయంగా స్వీకరించక ముందే ట్రంప్ తన యంత్రాంగాన్ని ఎంచుకోవటం ప్రారంభించాడు. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ ఒక సలహాదారు. అతగాడి దగ్గర నుంచి పచ్చిమితవాదుల వరకు ఎన్నికలలో తన కోసం పనిచేసిన వారిని లేదా తెర వెనుక ఉండి సహకరిం చిన వారి ప్రతినిధులను, తన అజెండాను నిర్దాక్షిణ్యంగా సమర్ధించే, ముందుకు తీసుకుపోయేవారిని, తన కనుసన్నలలో తీర్పులను




ఇచ్చే న్యాయమూర్తులను ఎంచుకున్నాడు. డెమోక్రటిక్ పార్టీ నుంచి ఫిరాయించిన తులసీ గబ్బార్డ్‌ను నేషనల్ ఇంటిలిజెన్స్ డైరెక్టర్‌గా నియమించాడు. కొందరు పార్లమెంటు సభ్యులను కూడా ఎంచుకున్నందున కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తరువాత ఆ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయి. అధికారానికి వచ్చిన వందరోజుల్లో ఏమి చేయనుందీ ట్రంప్ ముందుగానే సూచనప్రాయంగా వెల్లడించాడు. ముస్లింల మీద నిషేధం, అక్రమంగా ప్రవేశించిన లక్షలాది మంది విదేశీయులను సామూహికంగా బయటకు పంపటం, తన ఆదేశాల మేరకు 2021 జనవరి ఆరున అమెరికా అధికార కేంద్రం కాపిటోల్‌పై దాడిచేసిన వారిమీద ఉన్న కేసుల ఎత్తివేతకు క్షమాభిక్ష ప్రకటన, బైడెన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పర్యావరణ విధానాల రద్దు వంటివి వాటిలో ఉన్నాయి. అధికార యంత్రాంగ నియామకాల తీరుతెన్నులను చూసిన తరువాత అతగాడి ఫాసిస్టు అజెండాను అమలు జరపటం ఖాయమనే భయాందోళనలు ప్రారంభమయ్యాయి.

ఆయుధ పరిశ్రమల ప్రయోజనాల కోసం పనిచేసే ఫాక్స్‌న్యూస్ జర్నలిస్టు పీట్ హెగ్‌సేత్‌ను రక్షణశాఖ మంత్రిగా నియమించిన తీరు ఆ శాఖ యంత్రాంగాన్నే నివ్వెరపరిచినట్లు వార్తలు. దాడులలో మహిళలను నియమించకూడదని, యుద్ధ నేరాలకు పాల్పడిన వారిని క్షమించివేయటం వంటి పచ్చి మితవాద వైఖరులను పీట్ కలిగి ఉన్నాడు. తన టీవీ కార్యక్రమాలలో ట్రంప్‌ను అడ్డగోలుగా సమర్ధించాడు. పాలస్తీనానా, వెస్ట్ బాంకా అదెక్కడుంది అంటూ గుడ్డిగా వ్యతిరేకించిన "తీవ్రవాది" అర్కాన్సాస్ మాజీ గవర్నర్ మైక్ హక్‌బీని ఇజ్రాయిల్‌లో అమెరికా రాయబారిగా ఎంపిక చేయటాన్ని బట్టి రానున్న రోజుల్లో పశ్చిమాసియాలో చిచ్చు కొనసాగించేందుకే ట్రంప్ నిర్ణయించుకున్నట్లు తేటతెల్లమైంది. అందుకే ఇజ్రాయిల్ నాయకత్వం ట్రంప్ విజయోత్సవాలు జరుపుకుంటోంది. పాలస్తీనా నిర్వాసితులకు సాయం చేసే ఐరాస సహాయ సంస్థకు నిధులివ్వకూడదని వాదించే మహిళ ఎల్సీ స్టెఫానిక్‌ను ఐరాస రాయబారిగా ఎంచుకున్నాడు. ట్రంపే ఒక పిచ్చివాడు అనుకుంటే అలాంటి వాడి కొలువులో చేరినవారు ఎలాంటి ఉన్మాదచర్యలకు పాల్పడతారో తెలియదు. అమెరికా ఎన్నికలు అక్కడి కార్మికవర్గాన్ని,యావత్ ప్రపంచాన్నే ముప్పు ముంగిటకు చేర్చాయంటే అతిశయోక్తి కాదు.

# బుల్డోజర్‌కు బ్రేక్

సామాన్యుడి సొంతింటి కలమీద హిందీకవి ప్రదీప్ రాసిన ఓ కవితను ఉటంకిస్తూ, బుల్డోజర్ కూల్చివేతలను ఇకపై సహించేది లేదంటూ సుప్రీంకోర్టు బుధవారం ప్రశంసనీయమైన తీర్పు వెలువరించింది. అధికారులే న్యాయమూర్తుల్లా వ్యవహరిస్తూ, తక్షణతీర్పులతో ఇళ్ళకూల్చివేత శిక్షను అమలు చేస్తే ఊరుకొనేది లేదని సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. ఏదో ఒక నేరంలో నిందితుడో, దోషో అయినంతమాత్రాన నోటీసులు ఇవ్వకుండా, నిబంధనలు పాటించకుండా నేరుగా బుల్డోజర్లతో పోయి వారి నివాసాలను నేలమట్టం చేయడం అన్యాయం, అంతకుమించి రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆస్తుల కూల్చివేతకు సంబంధించి దేశవ్యాప్తంగా అమలయ్యే మార్గదర్శకాలను కూడా విడుదలచేసి, వాటిని అతిక్రమించినా, గీతదాటి దూకుడుగా వ్యవహరించినా సదరు అధికారులను వదిలిపెట్టేది లేదని, ధిక్కరణ చర్యలు తీసుకుంటామని కోర్టు స్పష్టంచేసింది. కూల్చివేతల్లో నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు తేలితే, బాధితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని అధికారులనుంచి ముక్కుపిండి వసూలు చేస్తానన్న హెచ్చరిక అత్యంత ప్రభావవంతంగా ఉంది. ఒక వ్యక్తి నిందితుడైతే అతడి నివాసాన్ని కూల్చివేయడం ద్వారా మొత్తం కుటుంబాన్ని శిక్షించడం, రోడ్డుపాల్జేయడం సరికాదన్నది మంచిమాట. 95 పేజీల తీర్పులో న్యాయమూర్తులు పలుచోట్ల బాధ, ఆగ్రహం వ్యక్తంచేస్తూ నిర్దిష్టమైన మార్గదర్శకాలతో భవిష్యత్తులో బుల్డోజర్ జస్టిస్‌ను నిలువరించేందుకు యథాశక్తి ప్రయత్నం చేశారు. ఈ తీర్పుతో సర్వోన్నతన్యాయస్థానం బుల్డోజర్‌ను గ్యారేజీలోకి నెట్టేసిందని అఖిలేష్‌యాదవ్ వ్యాఖ్యానించారు. ఆ మహాయంత్రాన్ని కూల్చివేతలకు వినియోగించి, ఈ తీరున తక్షణశిక్షలు వేయడం యూపీ యోగి కనుగొన్న ప్రక్రియ కనుక విపక్షనేతలంతా ఆయన దృష్టితోనే వ్యాఖ్యలు చేశారు. బుల్డోజర్ బాబాగా ప్రసిద్ధిచెందిన యోగి చేతికి ఏకంగా సంకెళ్ళుపడినంతగా సంతోషించారు. యూపీ ప్రభుత్వానికి ఈ తీర్పు ఎలా అర్థమైందో తెలియదుగానీ, దానిని చక్కగా స్వాగతిస్తూ తనకు అనుకూలంగా భాష్యం చెప్పుకుంది. షోకాజ్ నోటీసులు, అప్పీళ్ళు, గడువులు, బాధితుల వాదనలను



వినడం, మినిట్స్ రికార్డుచేయడం, యజమానికే అక్రమకట్టడాన్ని కూల్చివేసే అవకాశం ఇవ్వడం.. ఇలా పలురకాల మార్గదర్శకాలతో అధికారుల ముందరికాళ్ళకు సర్వోన్నతన్యాయస్థానం బలమైన బంధనాలు వేసింది. పాలకుల పక్షాన వారు కట్టుదాటి ప్రవర్తించకుండా లక్ష్మణరేఖలు గీసింది. కానీ, ఇప్పటికే నష్టపోయిన వందలాదిమందికి మాత్రం ఈ తీర్పు న్యాయం చేయలేదు. ఉత్తర్‌ప్రదేశ్‌లో యోగి అత్యధికంగా దుర్వినియోగపరచిన ఈ విధానాన్ని ఆ తరువాత బీజేపీ పాలిత రాష్ట్రాలన్నీ అమలు చేసిన విషయం తెలిసిందే. ప్రధానంగా మతహింసలు రేగినప్పుడు నివాసాల కూల్చివేతతో ముఖ్యంగా ముస్లింలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. హర్యానాలోని నుహ్, మధ్యప్రదేశ్‌లో ఖర్గోన్ వంటి చోట్ల మైనారిటీలను హెచ్చరించడానికి, అదుపులో ఉంచడానికి బుల్డోజర్ ఆయుధమైంది. ముస్లింలను ఆ రీతిలో శిక్షించడాన్ని బీజేపీ నాయకులు బాహాటంగా సమర్థించేవారు. నేరస్థులని నిర్ధారించేందుకు విడియోలు సరిపోతాయని, న్యాయస్థానాల అవసరం లేదని వ్యాఖ్యానించేవారు. నిందితులను గుర్తించడం నుంచి నేరం రుజువుచేయడంవరకూ ఉన్న సుదీర్ఘ ప్రక్రియలన్నీ పక్కకు నెట్టివేసి, ఇలా కొంపలు కూల్చడం ద్వారా తక్షణశిక్షలు వేయడాన్ని ప్రజలు కూడా మెచ్చడం, బుల్డోజర్లను బ్యాండ్‌బాజాతో ఘనంగా స్వాగతించడం చూశాం. ఏ నేరానికి ఈ శిక్షవేస్తున్నదీ రాజకీయనాయకులు బాహాటంగా చెబుతుంటే, అధికారులు మాత్రం అక్రమ నిర్మాణమనో, అనుమతులు లేవనో, ఆక్రమణదారులనో చెప్పి సదరు అనుమనితుల లేదా నిందితుల ఇంటినో, దుకాణాన్నో నేలమట్టం చేస్తూపోయేవారు. ఆ నేరానికీ, ఈ శిక్షకూ సంబంధం లేదని న్యాయస్థానాల్లోనూ వాదనలు సాగేవి. కానీ, అసలు నిజం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు వెలువడిన తీర్పు పాలకుల, అధికారుల దూకుడును బాగా నియంత్రిస్తుందని ఆశించాలి. ఒక వర్గాన్ని నియంత్రించేందుకు కూల్చివేతలను ఆయుధంగా వాడేవిషయంలో పాలకుల ఆదేశాలను అధికారులు గుడ్డిగా అమలుచేయకపోవచ్చు. తీర్పు వర్తించని ప్రాంతాలంటూ న్యాయస్థానం ఇచ్చిన మినహాయింపులను పాలకులు దుర్వినియోగం చేయకుండా చూడటం ముఖ్యం. మార్గదర్శకాలు నూరుశాతం అమలయ్యేట్టుగా జిల్లాకోర్టు నుంచి హైకోర్టు వరకూ శ్రద్ధపెట్టాలి

# ఇందిరమ్మ ఇల్లు 400 చదరపు అడుగుల్లో

-మొదటి విడతలో స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు రెవెన్యూ,గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

-స్నానాల గది,వంట గది తప్పనిసరి.. తొలి విడతలో స్థలం ఉన్నవారికి మంజూరు

-నాలుగు విడతల్లో రూ.5 లక్షలు.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ

మొదటి విడతలో స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు రెవెన్యూ,గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.లబ్ధిదారుడు 400 చదరపు అడుగుల్లో ఇల్లు నిర్మించుకోవాలన్నారు. అందులో స్నానాల గది,వంట గది తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.ఈ మేరకు ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారునికి ప్రభుత్వం నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు ఇస్తుందని తెలిపారు.పునాది నిర్మాణం పూర్తి కాగానే రూ. లక్ష, లెంటల్ లెవల్‌కు చేరగానే రూ.1.25 లక్షలు,స్లాబు వేశాక రూ. 1.75 లక్షలు, గృహప్రవేశం సమయంలో మిగిలిన లక్ష రూపాయలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.గ్రామ సభలను నిర్వహించి పేదల్లో బహుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని,ఇంటిని ఇంటి యజమానురాలి పేరునే మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. పార్టీ నేతలు, కార్యకర్తలు,ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి వినతిపత్రాలే వచ్చాయని వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నమూనాలు చూపించి గెలిచిన బీఆర్ఎస్ పార్టీ.. పదేళ్లు అధికారంలో ఉండి కట్టించలేదని విమర్శించారు. అలాగే ధరణి సమస్యలు, రుణమాఫీ తదితర అంశాలపైనా వినతులు వచ్చాయని చెప్పారు.కొత్త ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుకు తుది మెరుగులు దిద్దడం పూర్తికావచ్చిందన్నారు. త్వరలోనే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచే కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురానున్నట్లు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో కనుసైగలతో ప్రభుత్వ స్థలాలను తమ పేరిట మార్చుకున్నారని, ఆ స్థలాలను తిరిగి తీసుకుని పేదవాళ్లకు ఇస్తామని పేర్కొన్నారు.కొంత మంది అర్హులైన రైతులకు రూ.13 వేల కోట్ల మేరకు రుణాలను మాఫీ చేయాల్సి ఉందని,డిసెంబరు నెలలోపున ఆ రుణాలను మాఫీ చేస్తామని తెలిపారు.రాష్ట్రంలో పండిన ధాన్యం చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.బీఆర్ఎస్ హయాంలో రైతులను జైల్లో పెట్టిన విషయాన్ని మరిచిపోయి ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

# కలెక్టర్‌పైనే హత్యాయత్నం చేశారంటే మామూలు విషయం కాదు

ప్రజా స్వేచ్ఛ

రైతులను నష్టపెట్టాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని.. సమస్యలు విని పరిష్కరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదు.. లగచర్ల సంఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని ప్రకటించారు. ఈరోజు అధికారులపై దాడి జరిగినట్లు గానే.. రేపు రాజకీయ నాయకులకో, ప్రజలకో జరిగితే ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. జిల్లాకు ఫస్ట్ మెజిస్ట్రేట్‌గా ఉన్న కలెక్టర్‌పైనే హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారంటే మామూలు విషయం కాదని అన్నారు. అధికారుల మీద దాడి అనేది మనమీద మనం దాడి చేసుకున్నట్లే అని తెలిపారు. రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని సీరియస్ అయ్యారు. కుట్రపూరితంగా అధికారులను రైతులకు దూరం చేసే ప్రయత్నం కొంతమంది చేస్తున్నారని అన్నారు. గులాబీ గూండాల కుట్రలను రైతాంగం అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రజలను కాపాడుకున్నట్లే, అధికారులను కాపాడుకోలేకపోతే పని చేయడానికి ఏ అధికారి ముందుకు వస్తారు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం వెలగబెట్టిననాడు ఇదే పద్ధతి చేశారా? అని అడిగారు. ఏం తప్పు చేశారని ఆనాడు ఖమ్మంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైల్లో పెట్టారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లో రైతులను దేశద్రోహులుగా చిత్రీకరించారని గుర్తుచేశారు. పిల్లా, పాపా, ముసలి అనే తేడా లేకుండా రాత్రికి రాత్రి వారిని అరెస్ట్ చేసి సంకెళ్లు వేసిన సంగతి మరిచారా? అని అడిగారు. ఎగిసి ఎగిసి పడుతున్న కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో దళితులకు బేడీలు వేసిన సంగతి మరిచిపోయారా? అని మండిపడ్డారు.





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

రైతులను నష్టపెట్టాలన్నది ఈ ప్రభుత్వ ఉద్దేశం కాదు,వారి సమస్యలను వినడానికి,పరిష్కరించడానికి ఈ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేయడం మంచిపద్ధతి కాదు . లగచర్ల సంఘటను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటుంది. ఈ రోజు అధికారులపై దాడి జరిగినట్లు గానే ..రేపు రాజకీయ నాయకులకో, ప్రజలకో జరిగితే ప్రభుత్వం ఉపేక్షించదు జిల్లాకు ఫస్ట్ మెజిస్ట్రేట్‌గా ఉన్నకలెక్టర్‌పైనే హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారు. అధికారుల మీద దాడి అనేది మనమీద మనం దాడి చేసుకున్నట్లే! రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. కుట్రపూరితంగా అధికారులను రైతులకు దూరం చేసే ప్రయత్నం కొంతమంది చేస్తున్నారు. గులాబీ గూండాల కుట్రలను రైతాంగం అర్థం చేసుకోవాలి ప్రజలను కాపాడుకున్నట్లే, అధికారులను కాపాడుకోలేకపోతే పని చేయడానికి ఏ అధికారి ముందుకు వస్తారు? బిఆర్ ఎస్ ప్రభుత్వం అధికారం వెలగబెట్టిననాడు ఇదే పద్ధతి చేశారా? ఏం తప్పుచేశారని ఆనాడు ఖమ్మంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైల్లో పెట్టారు. మల్లన్నసాగర్ లో రైతులను దేశద్రోహులుగా చిత్రీకరించారు. పిల్లా,పాపా,ముసలి అనే తేడా లేకుండా రాత్రికి రాత్రి వారిని అరెస్ట్ చేసి సంకెళ్లు వేసిన సంగతి మరిచారా? ఎగిసి ఎగిసి పడుతున్న కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో దళితులకు బేడీలు వేసిన సంగతి మరిచిపోయారా? లగచర్లలో ఆ పరిస్థితి లేదు కదా?

# వకీల్‌ల కోసం వ్యాసరచన పోటీ






ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ( TPCC ) న్యాయ విభాగం చైర్మన్, పొన్నం అశోక్ గౌడ్ గారు నేతృత్వంలో తెలంగాణ వ్యాప్తంగా వకీల్‌ల కోసం వ్యాసరచన పోటీ నిర్వహించబడింది. న్యాయ సమాజాన్ని కలుపునకు ఉద్దేశించిన ఈ పోటీకి "ప్రస్తుత కాలంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి ఆవశ్యకత అయిన రాజ్యాంగం" అనే ముఖ్యమైన అంశం నిర్ణయించబడింది. ఈ పోటీ తెలంగాణలోని అన్ని వకీల్‌లకు ఓపెన్‌గా ఉంటుంది. వారు ప్రస్తుత పరిస్థితుల్లో భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందో గురించి తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు. ఈ చర్య TPCC న్యాయ విభాగం చేస్తున్న రాజ్యాంగం మరియు దాని ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడంలో భాగంగా నిర్వహించబడింది. వివరాల కోసం లేదా ప్రవేశాలను సమర్పించడానికి, దయచేసి TPCC న్యాయ విభాగాన్ని సంప్రదించండి.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ప్రతి:** మోమిన్ రోషన్ జమీర్ వకీల్‌జి వ్యాసరచన పోటీ సమన్వయకర్త రాజ్య విభాగం (చట్టం, మానవ హక్కులు మరియు RTI విభాగం) రాష్ట్ర సహ-సంయుక్త సమన్వయకర్త
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ( TPCC)

# జీతాల వివాదం - సింబయాసిస్ యూనివర్సిటీ ఎదుట ధర్నా




నందిగామ, నవంబర్ 14(ప్రజా స్వేచ్ఛ) రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోదల్లగూడలోని సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు కార్మికులు జీతాల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. వేతనాలు సకాలంలో అందడం లేదని ఆవేదన చెందుతూ యూనివర్సిటీ ముందు నిరసనకు దిగారు. పనిచేసే కార్మికులకు నిత్యం జీతాలు ఆలస్యం కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. తమకు నెల నెలా జీతాలు క్రమంగా చెల్లించాలని, సంబంధిత అధికారులు సమస్యపై స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై యూనివర్సిటీ ప్రతినిధులు, కాంట్రాక్టర్ నుండి ఇంకా ఎలాంటి స్పందన రాకపోవడంతో, కార్మికులు తమ నిరసనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

# ఎలిమినేడు భూ పోరాట సమితి అధ్యక్షుడు అరెస్టు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 13 ప్రజా స్వేచ్ఛ

రంగారెడ్డి జిల్లా ఎలిమినేడు భూ పోరాట సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. గతంలో నష్టపరిహారం సరిగా అందలేదని జాతీయ ఎస్సీ కమిషన్కు ఫిర్యాదు చేసిన రైతులు, ఈరోజు కమిషన్ కలెక్టర్ ఆఫీస్ కు విచ్చేయు సందర్భంలో ఈ అరెస్టులు చోటుచేసుకున్నాయి. టిఆర్ఎస్ ప్రభుత్వంలో 600 ఎకరాల భూమిని వివిధ కంపెనీల కోసం ప్రభుత్వం ఇచ్చిన ఎలిమినేడు గ్రామ రైతులు, తగిన నష్టపరిహారం ఇవ్వలేదని గత కొద్ది కాలంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ ఈ భూముల గురించి జిల్లా కలెక్టర్ దగ్గరికి విచ్చేసిన సందర్భంలో, ఈ అరెస్టులు జరిగినట్టు సమాచారం.

## ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకున్న అఘోరీ




మెదక్ నవంబర్ 14(ప్రజా స్వేచ్ఛ

మారిన అఘోరీ మాత గురువారం మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అఘోరీని చూసేందుకు, ఆమె ఆశీర్వాదం తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం హిమాలయాలను వదిలి దేశంలో పర్యటిస్తున్నానని చెప్పిన అఘోరీ తన మాటలు, చర్యలతో వివాదస్పద మయ్యారు. కొద్ది రోజులుగా ఏపిలోని శైవ క్షేత్రాలను సందర్శించిన ఆమె ప్రస్తుతం తెలంగాణలో పర్యటిస్తున్నారు.మహిళలపైన, దేవాలయాలపైన దాడులు ఆపకపోతే తెలంగాణ ప్రభుత్వానికి శివతాండవం చూపిస్తానంటూ, అత్యాచారాలకు పాల్పడే వారి అంగాలను ఖండిస్తామంటూ హెచ్చరికలు చేశారు. అఘోరీ తొలుత తమిళనాడు నుంచి తెలంగాణకు, ఇక్కడి నుంచి కేదరినాథ్ కు, మళ్లీ తెలంగాణకు, ఇటు నుంచి కార్తీక మాసం శైవ క్షేత్రాల సందర్శన పేరుతో ఆంధ్రప్రదేశ్ లో పర్యటించి, మళ్లీ తెలంగాణకు చేరుకుని తన చర్యలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు.

# శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రామగుండం సీపీ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

-మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసిన మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్



షాద్ నగర్, నవంబర్ 14(ప్రజా స్వేచ్ఛ

షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్ నగర్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అర్చకులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ ను శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. షాద్ నగర్ పట్టణానికి చెందిన మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్ మర్యదపూర్వకంగా కమిషనర్ ను కలసి పుష్పగుచ్చం అందించారు..

## జీతాల వివాదం - సింబయాసిస్ యూనివర్సిటీ ఎదుట ధర్నా





నందిగామ, నవంబర్ 14(ప్రజా స్వేచ్ఛ) రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోదల్లగూడలోని సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు కార్మికులు జీతాల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. వేతనాలు సకాలంలో అందడం లేదని ఆవేదన చెందుతూ యూనివర్సిటీ ముందు నిరసనకు దిగారు. పనిచేసే కార్మికులకు నిత్యం జీతాలు ఆలస్యం కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. తమకు నెల నెలా జీతాలు క్రమంగా చెల్లించాలని, సంబంధిత అధికారులు సమస్యపై స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై యూనివర్సిటీ ప్రతినిధులు, కాంట్రాక్టర్ నుండి ఇంకా ఎలాంటి స్పందన రాకపోవడంతో, కార్మికులు తమ నిరసనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ఎలిమినేడు భూ పోరాట సమితి అధ్యక్షుడు అరెస్టు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 13 ప్రజా స్వేచ్ఛ

రంగారెడ్డి జిల్లా ఎలిమినేడు భూ పోరాట సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. గతంలో నష్టపరిహారం సరిగా అందలేదని జాతీయ ఎస్సీ కమిషన్కు ఫిర్యాదు చేసిన రైతులు, ఈరోజు కమిషన్ కలెక్టర్ ఆఫీస్ కు విచ్చేయు సందర్భంలో ఈ అరెస్టులు చోటుచేసుకున్నాయి. టిఆర్ఎస్ ప్రభుత్వంలో 600 ఎకరాల భూమిని వివిధ కంపెనీల కోసం ప్రభుత్వం ఇచ్చిన ఎలిమినేడు గ్రామ రైతులు, తగిన నష్టపరిహారం ఇవ్వలేదని గత కొద్ది కాలంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ ఎస్టీ కమిషన్ ఈ భూముల గురించి జిల్లా కలెక్టర్ దగ్గరికి విచ్చేసిన సందర్భంలో, ఈ అరెస్టులు జరిగినట్టు సమాచారం.


## ఏడుపాయల వన దుర్గమ్మను దర్శించుకున్న అఘోరీ



మెదక్ నవంబర్ 14(ప్రజా స్వేచ్ఛ)
మారిన అఘోరీ మాత గురువారం మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అఘోరీని చూసేందుకు, ఆమె ఆశీర్వాదం తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం హిమాలయాలను వదిలి దేశంలో పర్యటిస్తున్నానని చెప్పిన అఘోరీ తన మాటలు, చర్యలతో వివాదస్పద మయ్యారు. కొద్ది రోజులుగా ఏపిలోని శైవ క్షేత్రాలను సందర్శించిన ఆమె ప్రస్తుతం తెలంగాణలో పర్యటిస్తున్నారు.మహిళలపైన, దేవాలయాలపైన దాడులు ఆపకపోతే తెలంగాణ ప్రభుత్వానికి శివతాండవం చూపిస్తానంటూ, అత్యాచారాలకు పాల్పడే వారి అంగాలను ఖండిస్తామంటూ హెచ్చరికలు చేశారు. అఘోరీ తొలుత తమిళనాడు నుంచి తెలంగాణకు, ఇక్కడి నుంచి కేదరినాథ్ కు, మళ్లీ తెలంగాణకు, ఇటు నుంచి కార్తీక మాసం శైవ క్షేత్రాల సందర్శన పేరుతో ఆంధ్రప్రదేశ్ లో పర్యటించి, మళ్లీ తెలంగాణకు చేరుకుని తన చర్యలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు.

## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రామగుండం సీపీ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

-మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసిన మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్



షాద్ నగర్, నవంబర్ 14(ప్రజా స్వేచ్ఛ)
షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్ నగర్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అర్చకులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ ను శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. షాద్ నగర్ పట్టణానికి చెందిన మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్ మర్యదపూర్వకంగా కమిషనర్ ను కలసి పుష్పగుచ్ఛం అందించారు..

# యువత వ్యాపారంలో రాణించాలి

– టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, నవంబర్ 13 ప్రజా స్వేచ్ఛ
నిరుద్యోగ యువత ఉద్యోగాలు రాలేదని సమయం వృధా చేయకుండా అనుభవం కలిగిన వ్యాపారంలో రాణించాలని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మైసిగండి వాసి కేతావత్ సక్రు నాయక్ బిఎన్ రెడ్డి నగర్, హైదరాబాద్ లో నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహ ఫ్రెష్ చికెన్ లైవ్ ఫిష్ షాప్ ను ఆయన ప్రారంభించారు. "మనం ఉన్న చోట వ్యాపారం చేయని పక్షంలో, వ్యాపారం ఉన్న చోట, హైదరాబాద్ లాంటి నగరాల్లో భవిష్యత్ ను రూపుదిద్దుకోవాలి. వివిధ వ్యాపార రంగంలో అనుభవం ఉన్న వారు పోటీ తత్వంతో తమ తమ వ్యాపారాల్లో రాణించాలని, ప్రభుత్వం ప్రోత్సాహకం కూడా వినియోగించుకోవాలి. స్కిల్స్ ఉన్న వారు టెక్నికల్ మార్గంలో రాణించాలని" శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సక్రి సోమ్లా నాయక్, గంగా, కృష్ణా నాయక్, రాము నాయక్, రాందాస్ నాయక్, సుమన్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్ నగర్ నవంబర్ 14,ప్రజా స్వేచ్ఛ
అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు పంపిణీ చేశారు. కొత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి మండలానికి సంబంధించిన 34 మంది లబ్దిదారులకు 13,08,500 రూపాయల చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు పట్టణ పార్టీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, కొత్తూరు మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి నందిగామ మండల అధ్యక్షుడు జంగా నరసింహులు, మాజీ ఎంపీటీసీలు కుమార స్వామి గౌడ్, కొమ్ము కృష్ణ, కొత్తూరు ఎంపీడీవో , కొత్తూరు తాహసిల్దార్, ఉమ్మడి మండలానికి సంబంధించిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## వెలుముల పల్లిలో కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొన్న వంగూరు మండల ఎమ్మార్వో



వంగూరు, నవంబర్ 14 ప్రజా స్వేచ్ఛ
వంగూరు మండల పరిధిలోని వెలములపల్లి గ్రామంలో కుటుంబ సమగ్ర సర్వేను స్థానిక వంగూరు మండల ఎమ్మార్వో మరియు డిప్యూటీ తహసిల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్వేలో ప్రజల ఎడల నిర్లక్ష్య ధోరణి అవలంబించకుండా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, కుటుంబ సర్వే నమోదు చేయాలని సర్వే అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల ఎమ్మార్వో, సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించవలసిందిగా ప్రజలకు వివరించారు. ప్రజలు సిబ్బందికి సహకరిస్తే సర్వేను త్వరగా పూర్తి చేయగలమని స్థానిక మండల ఎమ్మార్వో పేర్కొన్నారు.

# బిజెపి సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కండి

-కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కమ్మరి భూపాలచారి



కొందుర్గు 14, ప్రజా స్వేచ్ఛ
భారతీయ జనతా పార్టీ సంస్థాగత పర్వ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో మండల సభ్యత్వ ప్రముఖ్ చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి అధ్యక్షతన మండల క్రియాశీల సభ్యుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమ్మరి భూపాల చారి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి సభ్యత్వ నమోదు ముగింపు దశకు చేరుకున్న సందర్భంగా గ్రామాలలో బూత్ కమిటీల నిర్మాణానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన సందర్భంగా నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో భారత్ నలువైపులా అన్ని రంగాలలో అభివృద్ధి దిశలో పయనిస్తుందని, ప్రపంచ దేశాలకు భారత్ దిక్సూచిగా మారనుందని పేర్కొన్నారు. ఇంకా క్రియాశీల సభ్యత్వం పొందాలనుకునేవారు వేగంగా సభ్యత్వ నమోదును చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోయ శంకర్, బలవంత రెడ్డి, ఈసరి సత్యనారాయణ, పసుపుల ప్రశాంత్, సత్యనారాయణ రెడ్డి, బోయ అశోక్ శ్రీనివాస్, యాదయ్య, మల్లేష్, సురేష్, రవి, గోపాల్, సత్యం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



తారామతిపెట్, నవంబర్ 14 ప్రజా స్వేచ్ఛ
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తారామతిపెట్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు, కలెక్టర్, డీఈవో, ఎంఈవోలుగా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. బాలల దినోత్సవం సందర్భంగా, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలు బోధించారు. కలెక్టర్గా లాహరి, డీఈవోగా లక్కీ, ఎంఈవోగా శరణ్య పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుంది. పాఠశాల హెచ్ఎంగా జశ్వంత్ తో పాటు ఇతర విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

GHM ప్రసాద్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రయ, జ్యోతి, మహిపాల్, రమేశ్ రావు, వెంకట్ రాంరెడ్డి, నాగజ్యోతి, నరసింహారెడ్డి, రమేష్, యాదమ్మ, మహేందర్, పరశు రాం, కిరణ్ కుమారి, నరసింహారావు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఎరుకల సుమలత పాల్గొన్నారు.

బిజినెస్

# ఆర్థిక సంక్షోభంలో బోయింగ్..
## 17 వేల మందికి లేఆఫ్స్..

ప్రముఖ విమానాల తయారీ సంస్థ బోయింగ్ భారీగా ఉద్యోగుల ఉద్వాసనకు రంగం సిద్ధం చేసింది. ఒకేసారి 17 వేల మంది ఉద్యోగులపై వేటు వేయనున్నది. ప్రపంచ వ్యాప్తంగా పని చేస్తున్న సిబ్బందిలో సుమారు 10 శాతం మందిని తొలగించడానికి బుధవారం నుంచి పింక్ స్లిప్‌లు జారీ చేస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక ఒత్తిళ్లు, ఉత్పత్తి ఆలస్యం కావడంతో బోయింగ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. అమెరికాలో పని చేస్తున్న ఉద్యోగులు స్థానికత నిబంధనలకు అనుగుణంగా 60 రోజుల నోటీసు పీరియడ్‌కు అనుగుణంగా వచ్చే జనవరి వరకూ ఉద్యోగాల్లో కొనసాగుతారు.సియాటెల్ ప్రాంతంలో 33 వేల మంది కార్మికులు కొన్ని వారాల పాటు సమ్మె చేయడంతో 737 మ్యాక్స్, 767, 777 జెట్




విమానాల ఉత్పత్తి నిలిచిపోయింది. సమ్మె వల్ల మూడో త్రైమాసికంలో 500 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లిందని బోయింగ్ తెలిపింది. ఈ నష్టాలను పూడ్చుకోవడానికి ఉద్యోగులకు ఉద్వాసన తెలపడమే మార్గంగా భావిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల వల్ల ఇక పూర్తి ప్రాధాన్య అంశాలపైనే దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించామని బోయింగ్ పేర్కొంది. కష్టకాలంలో ఉద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది.

## హెూండా కార్లపై తగ్గింపుల జాతర.. ఆ మోడల్స్‌పై నమ్మలేని ఆఫర్స్




ప్రస్తుతం హెూండా కార్స్ అమేజ్, సిటీ, ఎలివేట్ వంటి కార్లపై భారీ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. హెూండా అమేజ్ జెడ్ఎక్స్ ట్రిమ్ పై రూ. 1.26 లక్షల వరకు తగ్గింపుతో అందుబాటులో ఉంది. ఎస్ ట్రిమ్ రూ. 96,000 తగ్గింపుతో లభిస్తుండగా, అమేజ్ ఈ రూ. 86,000 తగ్గింపును అందిస్తున్నారు. హెూండా సిటీకు సంబంధించిన జెడ్ఎక్స్ ట్రిమ్ రూ. 1.07 లక్షల తగ్గింపుతో లభిస్తుంది. అయితే ప్రీమియం సెడాన్ యొక్క ఇతర ట్రిమ్‌లు రూ. 92,000 వరకు ప్రయోజనాలను అందిస్తాయి. సిటీ ఈ హెచ్ఈవీ కూడా రూ. 65,000 వరకు ఇయర్ ఎండ్ తగ్గింపుతో అందుబాటులో ఉంది. భారతదేశంలో హెూండాకు సంబంధిచిన ఫ్లాగ్‌షిప్ ఉత్పత్తి అయిన ఎలివేట్ ఎస్‌యూవీ జెడ్ ఎక్స్ ట్రిమ్ పై రూ. 86,000 తగ్గింపును అందిస్తుంది. కాంపాక్ట్ ఎస్‌యూవీకు సంబంధించిన ఎస్‌వీ, వీ, జెడ్ ట్రిమ్స్‌పై రూ.76,000 వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి.హెూండా అమేజ్ భారతదేశంలో రూ. 7.19 లక్షల నుంచి రూ. 9.95 లక్షల మధ్య (ఎక్స్-షోరూమ్) అందుబాటులో ఉంది. హెూండా సిటీ రూ. 11.82 లక్షల నుండి రూ. 16.35 లక్షల (ఎక్స్-షోరూమ్), సిటీ ఈహెచ్‌వీ రూ. 19 లక్షల నుండి రూ. 20.55 లక్షల మధ్య (ఎక్స్-షోరూమ్) అందుబాటులో ఉన్నాయి. హెూండా ఎలివేట్ ధరలు రూ. 11.69 లక్షల నుంచి ప్రారంభమై రూ. 16.43 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉన్నాయి. హెూండా అమేజ్‌ను భారతదేశంలో పరిచయం చేయడానికి సిద్ధమవుతోంది. బ్రాండ్ ఇటీవలే సబ్ కాంపాక్ట్ సెడాన్‌కు సంబంధించిన కొత్త వెర్షన్ డిజైన్ స్కెచ్‌లను షేర్ చేసింది. కొత్త అకార్డ్, సివిక్, సిటీ వంటి బిగ్ సెడాన్లు హెూండా లైనప్‌లనుకొత్త అమేజ్ డిజైన్ తలపించేలా ఉంది. 2024 అమేజ్ ఇంటీరియర్ కూడా సవరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో కొత్త లేఅవుట్ ఉంటుంది. హెూండా అమేజ్ లేటెస్ట్ వెర్షన్ కొన్ని నెలల్లోనే భారతదేశంలో లాంచ్ చేసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# స్విగ్గీ ఎంట్రీ అదిరింది..

### -తొలిరోజే లక్ష కోట్లు దాటిన మార్కెట్ విలువ

ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ.. దేశీయ స్టాక్ మార్కెట్లలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఓవైపు మార్కెట్లు భీకర నష్టాల్లో నడుస్తున్నా.. మదుపరులు మాత్రం ఈ కంపెనీ షేర్లను ఎగబడి కొనేశారు. దీంతో తొలిరోజే షేర్ విలువ దాదాపు 17 శాతం పెరిగింది. బీఎస్ఈలో ఇష్యూ ధర కన్నా 5.64 శాతం ఎగిసి రూ.412 వద్ద, ఎన్ఎస్ఈలో 7.69 శాతం ఎగబాకి రూ.420 వద్ద లిస్టింగైంది. చివరకు బీఎస్ఈలో 16.91 శాతం పుంజుకొని రూ.455.95 వద్ద ముగియగా, ఒకానొక దశలో రూ.465.30ను తాకింది. అలాగే ఎన్ఎస్ఈలో 16.92 శాతం వృద్ధితో




రూ.456 వద్ద నిలిచింది. స్విగ్గీ ఇష్యూ ధర రూ.390గా ఉన్నది. ఇక బంపర్ సక్సెస్‌తో కంపెనీ మార్కెట్ విలువ లక్ష కోట్లు దాటి రూ.1,02,062.01 కోట్లకు చేరింది. మరోవైపు ఎంప్లాయిస్ స్టాక్ ఆప్షన్ కింద అర్హులైన ఉద్యోగులకు స్విగ్గీ కేటాయించిన షేర్ల విలువ ఇప్పుడు భారీగా పెరగడంతో వారంతా కోటీశ్వరులైయ్యారు. 500 మంది దగ్గర రూ.2 కోట్ల విలువైన షేర్లున్నట్లు సమాచారం. ఇక స్విగ్గీ విజయం సాధించడంతో దాని ప్రత్యర్థి సంస్థ జొమాటో శుభాకాంక్షలు తెలిపింది. జొమాటో మార్కెట్ విలువ రూ. 2,28,463.62 కోట్లుగా ఉన్నది.

# చరిత్ర సృష్టించిన అర్ష్‌దీప్ సింగ్..

స్పోర్ట్స్

టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత్ పేసర్‌గా నిలిచాడు. సౌతాఫ్రికాతో బుధవారం జరిగిన మూడో టీ20లో మూడు వికెట్లు తీయడం ద్వారా అర్ష్‌దీప్ సింగ్ ఈ ఫీట్ సాధించాడు. ఆఖరి ఓవర్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ సాధించిన మార్కో జాన్సెన్‌ను ఔట్ చేసిన అర్ష్‌దీప్ సింగ్ అత్యధిక వికెట్ల రికార్డుతో పాటు టీమిండియాకు విజయాన్నందించాడు. మొత్తం 92 వికెట్లతో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన పేసర్‌గా అర్ష్‌దీప్ సింగ్ గుర్తింపు పొందాడు. ఈ క్రమంలో భువనేశ్వర్ కుమార్(90 వికెట్లు), జస్‌ప్రీత్ బుమ్రా(89 వికెట్లను)లను అధిగమించాడు.ఇక అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ 96 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ మరో ఐదు వికెట్లు తీస్తే చాహల్‌ను కూడా అధిగమించనున్నాడు.ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 11 పరుగుల తేడాతో గెలుపొందింది.




ఈ విజయంతో నాలుగు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగులు చేసింది. తిలక్ వర్మ (56 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సలతో 107) అజేయ శతకంతో చెలరేగగా.. అభిషేక్ శర్మ(25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సలతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో ఆండిలే సిమలనె, కేశవ్ మహరాజ్ రెండేసి వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్ ఓ వికెట్ పడగొట్టాడు.అనంతరం లక్ష్యఛేధనకు దిగిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 208 పరుగులే చేసి ఓటమిపాలైంది. చివర్లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో మార్కో జాన్సెన్(17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సలతో 54) పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. హెన్రీచ్ క్లాసెన్(22 బంతుల్లో ఫోర్, 4 సిక్సలతో 41) ధాటిగా ఆడాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తీ రెండు వికెట్లు పడగొట్టాడు. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌కు తలో వికెట్ దక్కింది.ఆఖరి ఓవర్‌లో సౌతాఫ్రికా విజయానికి 25 పరుగులు అవసరమవ్వగా.. మార్కో జాన్సెన్ సిక్సర్ బాది టెన్షన్ పెట్టాడు. అయితే ఆ మరుసటి బంతికే అతన్ని ఎల్బీగా పెవిలియన్ చేర్చిన అర్ష్‌దీప్ సింగ్ కట్టడిగా బౌలింగ్ చేసి భారత్‌కు చిరస్మరణీ విజయాన్ని అందించాడు.

## చరిత్ర సృష్టించిన వరుణ్ చక్రవర్తీ..


టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తీ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఓ ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. సౌతాఫ్రికాతో బుధవారం జరిగిన మూడో టీ20లో మూడు వికెట్లు తీయడం ద్వారా వరుణ్ చక్రవర్తీ ఈ ఫీట్ సాధించాడు. సౌతాఫ్రికా గడ్డపై జరుగుతున్న ఈ నాలుగు టీ20ల సిరీస్‌లో వరుణ్ చక్రవర్తీ దుమ్మురేపుతున్నాడు. తొలి టీ20లో మూడు వికెట్లు తీసిన వరుణ్ చక్రవర్తీ..




రెండో టీ20లో ఐదు వికెట్లు పడగొట్టాడు. మూడో టీ20లో ధారళంగా పరుగులిచ్చినా మూడు వికెట్లు తీసాడు. మొత్తం 10 వికెట్లతో హయ్యెస్ట్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రికార్డును అధిగమించాడు. 2016లో శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో అశ్విన్ 9 వికెట్లు తీసాడు. గత 8 ఏళ్లుగా ఈ రికార్డ్ చెక్కుచెదరలేదు. గతేడాది ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌లో రవి బిష్ణోయ్ 9 వికెట్లు తీసినా అశ్విన్‌ను అధిగమించలేకపోయాడు. ఈ జాబితాలో వరుణ్ చక్రవర్తీ, అశ్విన్ తర్వాత దీపక్ చాహర్(2019లో బంగ్లాదేశ్‌తో 8 వికెట్లు), అక్షర్ పటేల్(2022లో ఆస్ట్రేలియాతో 8 వికెట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా 11 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో నాలుగు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 219 పరుగులు చేసింది. తిలక్ వర్మ (56 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సలతో 107) అజేయ శతకంతో చెలరేగగా.. అభిషేక్ శర్మ(25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సలతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో ఆండిలే సిమలనె, కేశవ్ మహరాజ్ రెండేసి వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్ ఓ వికెట్ పడగొట్టాడు.అనంతరం లక్ష్యఛేధనకు దిగిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 208 పరుగులే చేసి ఓటమిపాలైంది. చివర్లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో మార్కో జాన్సెన్(17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సలతో 54) పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. హెన్రీచ్ క్లాసెన్(22 బంతుల్లో ఫోర్, 4 సిక్సలతో 41) ధాటిగా ఆడాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తీ రెండు వికెట్లు పడగొట్టాడు. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌కు తలో వికెట్ దక్కింది.

# రివర్స్ స్వీప్‌తో సిక్సర్..
## పాక్ పేసర్లకు దడ పుట్టించిన మ్యాక్స్‌వెల్

ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఎప్పుడు ఎలా ఆడుతాడో తెలియదు. క్రీజులో కుదురుకున్నాడంటే మాత్రం భారీ షాట్లతో విరుచుకుపడుతాడు. స్పిన్నర్లను ముప్పతిప్పలు పెడుతూ రివర్స్ స్వీప్, స్వీప్ షాట్లతో బౌండరీల మోత మోగిస్తాడు. ఈమధ్య పెద్దగా రాణించని మ్యాక్స్‌వెల్ టీ20 మ్యాచ్‌లో తన స్టయిల్లో రెచ్చిపోయాడు.పాకిస్థాన్ పేస్ బౌలర్లను ఊచకోత కోస్తూ స్కోర్ బోర్డును ఉరికించాడు. ముఖ్యంగా పాక్ ప్రధాన పేసర్ షాహీన్ అఫ్రిదిని లక్ష్యంగా చేసుకొని మ్యాక్సీ ఓ రేంజ్‌లో చెలరేగాడు. బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియంలో మ్యాక్సీ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ఉన్నంత సేపు పాక్



బౌలర్లను వణికించాడు. యువ పేసర్ నసీం షా వేసిన రెండో ఓవర్లో ఆసీస్ చిచ్చరపిడుగు 4, 0, 4, 4, 4 బాదాడు.ఆ తర్వాత హ్యారిస్ రవుఫ్‌కు చుక్కలు చూపిస్తూ ఒక ఫోర్, 2 సిక్సర్లు బాదాడు. ఇక.. షాహీన్ అఫ్రిదికి కూడా ఆసీస్ ఆల్‌రౌండర్ దడ పుట్టించాడు. అతడు వేసిన 4 వ ఓవర్లో రివర్స్ స్వీప్ ద్వారా బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు మ్యాక్సీ. ఆ షాట్ చూసిన అఫ్రిది ఇదేం విధ్వంసం రా బాబు అని తల పట్టుకున్నాడు. ప్రస్తుతం మ్యాక్సీ సుడిగాలి ఇన్నింగ్స్ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది. స్వదేశంలో పాకిస్థాన్‌కు పెద్దగా పోటీ ఇవ్వలేక వన్డే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా టీ20 సిరీస్ పట్టేయాలనే పట్టుదలతో ఉంది.




Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492